సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



హామీలను అమలు చేయాలి

హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ధర్నాను శుక్రవారం చేపట్టారు.

IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,13,500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,205
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,511
నవర (8 గ్రాములు)	రూ.84,088

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4 /25.7

జిల్లాలో అక్కడక్కడా శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 83 శాతంగా శుక్రవారం నమోదైంది.

న్యూస్‌రీల్

సోమశిల నుంచి 27,700 క్యూసెక్కుల విడుదల



సోమశిల: సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టాకు నీటి విడుదలను పెంచామని ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 73.95 టీఎంసీలకు చేరువలో ఉన్న నేపథ్యంలో.. ఎగువ నుంచి 39 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్న దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 27,700 క్యూసెక్కులను 5, 6, 7వ క్రస్ట్ గేట్ల ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. వరద ఉధృతి తగ్గేంత వరకు కొనసాగుతుందని తెలిపారు. కండలేరుకు 10,450.. ఉత్తరకాలువకు 400 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు. జలాశయంలో 100.01 మీటర్ల నీటిమట్టం నమోదైందని పేర్కొన్నారు.

టీఏ, ఈసీకి షోకాజ్ నోటీసుల జారీ

దుత్తలూరు: విచక్షణ మరిచి స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం దూషించుకున్న టీఏ, ఈసీకి షోకాజ్ నోటీసులను జారీ చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పత్రికల్లో కథనాలు ప్రచురితమవడంతో సిబ్బందిపై డ్వామా పీడీ గంగాభవాని ఆగ్రహం వ్యక్తం చేసి ఘటనపై విచారణ జరిపి నివేదికను అందజేయాల్సిందిగా ఏపీడీ మృదులను ఆదేశించారు. ఈ క్రమంలో కావలిలో ఏపీడీ వద్దకు ఉపాధి సిబ్బంది శుక్రవారం హాజరయ్యారు. దీంతో ఆమె తీవ్రంగా మందలించారని తెలిసింది.

జెడ్పీ స్కూల్లో ఆకస్మిక తనిఖీ



కావలి(అల్లూరు): పట్టణ పరిధిలోని ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇక్కడ సరైన వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అంశమై పత్రికల్లో కథనాలు ప్రచురితమవడంతో తనిఖీ చేశానని వివరించారు. టాయిలెట్లు, నీటి సదుపాయం కోసం అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. టాయ్‌లెట్ల మరమ్మతులు, ఏర్పాటు కోసం రూ.3.3 లక్షలను 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి కేటాయించామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంచి మార్కులను సాధించాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. విజయ దీపిక స్టడీ మెటీరియల్‌ను త్వరలో అందజేయనున్నామని వెల్లడించారు.

భూసేకరణ వేగవంతం

నెల్లూరురూరల్: జిల్లాలోని గుడ్లూరు మండలం చేవూరులో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు భూసేకరణను ప్రభుత్వం వేగంగా చేపడుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బీపీసీఎల్ సంస్థను స్థాపించనున్నారని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని వివరించారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 49.38 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. వివిధ కాలువలకు 1325 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

పన్నుకు మన్ను

- చీమకుర్తి, మార్టూరు నుంచి లారీలు, కంటైనర్లలో స్లాబుల రవాణా
- చెన్నై, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు యథేచ్ఛగా..
- నిత్యం 50 నుంచి 60 వాహనాల్లో తరలింపు
- విదేశాలకు 0.1.. ఇతర రాష్ట్రాలకు 18 శాతం జీఎస్టీ
- ఇవేవీ చెల్లించకుండానే రయ్.. రయ్
- వీటిని దాటించేందుకు బృందాలుగా ముఠాలు

గ్రానైట్ స్లాబుల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలు అనే చందంగా సాగుతోంది. వీటికి సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండానే ఇతర దేశాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొందరు అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి ఈ తంతును నడిపిస్తున్నారు. జీఎస్టీ, రాయల్టీని చెల్లించాల్సి ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా కృష్ణపట్నం పోర్టుతో పాటు చెన్నై, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు కంటైనర్లలో యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. వీటిని రాష్ట్ర సరిహద్దులు దాటించేందుకు కొంతమంది సభ్యులు బృందంగా ఏర్పడ్డారు. ఒక్కో లారీ నుంచి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తూ తమ పనిని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.



నెల్లూరు (టౌన్): చీమకుర్తి, మార్టూరు నుంచి లారీలు, కంటైనర్లలో స్లాబులను రవాణా చేస్తూ పన్నుకు కొందరు ఎగనామం పెడుతున్నారు. కొంత మంది ముఠా సభ్యులు జీఎస్టీ, మైనింగ్, పోలీస్, విజిలెన్స్ అధికారులతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకొని వారికి నెలవారీ మామూళ్లను సమర్పిస్తూ తమ పనిని కానిస్తున్నారు. అలా కాకుండా ఒకవేళ తనిఖీల్లో పట్టుబడితే లారీకి రూ.పది వేల నుంచి రూ.15 వేల వరకు ఇచ్చి పంపిస్తున్నారు. ఈ తరహాలో ఎలాంటి పన్ను చెల్లించకుండా ఇతర ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో తరలిస్తూ ప్రభుత్వదాయానికి భారీగా గండికొడుతున్నారు.

జోరుగా రవాణా

చీమకుర్తి, గురుజేపల్లి, బల్లికురవ ప్రాంతాల్లో గ్రానైట్ గనులున్నాయి. ఈ రాయి నుంచి వచ్చిన స్లాబులకు ఇతర దేశాలు, రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఆయా చోట్ల నుంచి నిత్యం 50 నుంచి 60 వరకు కంటైనర్లలో కృష్ణపట్నం, చెన్నై, బెంగళూరు, కేరళ తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఒక్కో వాహనంలో నాలుగు వేల నుంచి ఐదు వేల అడుగుల వరకు గల స్లాబులను తీసుకెళ్తున్నారు. ఒక్కో వెహికల్‌లో తరలించే వీటి విలువ రూ.నాలుగు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఉంటుంది.

చెల్లించాల్సింది ఇలా..

వాస్తవానికి ఇతర దేశాలకు వీటిని రవాణా చేయాలంటే 0.1.. అదే ఇతర రాష్ట్రాలకైతే 18 శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా స్లాబ్ ఒక అడుగుకు మైనింగ్ శాఖకు రూ.ఎనిమిది వేల మేర చెల్లించాలి. ఉదాహరణకు ఒక్కో లారీ లేదా కంటైనర్‌లో నాలుగు వేల అడుగులను ఇతర దేశాలకు పంపాల్సి ఉంటే, జీఎస్టీ రూపంలో రూ.400.. ఇతర రాష్ట్రాలకైతే 18 శాతం లెక్కను రూ.72 వేలను చెల్లించాల్సి ఉంటుంది. మైనింగ్‌కు సంబంధించి అడుగుకు రూ.ఎనిమిది రాయల్టీ లెక్కన నాలుగు వేలకు రూ.32 వేలను చెల్లించాలి. ఈ రకంగా జీఎస్టీ, రాయల్టీ రూపంలో రూ.లక్షకు పైగా సమర్పించాలి.

లక్షల్లో పన్ను ఎగవేత

జీఎస్టీ, రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఈ వాహనాలు అధికారుల కంటపడకుండా జిల్లా సరిహద్దు దాటించినందుకు ఒక్కో లారీ నుంచి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కొందరు వసూలు చేస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితులు.. లేదా అధికారులకు తెలియకుండా తరలించే సమయంలో పట్టుబడితే వాహనంలో ఉన్న వాటికి సంబంధించిన జీఎస్టీ, రాయల్టీని ముఠా సభ్యులే చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా వీటిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తనిఖీలు చేస్తునే ఉన్నాం

జాతీయ రహదారిపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న లారీలు, కంటైనర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇలాంటి వాహనాల విషయం ఎవరికైనా తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. కేసులు నమోదు చేసి పన్ను చెల్లించేలా చర్యలు చేపడతాం.

– కిరణ్, జేసీ, వాణిజ్య పన్నుల శాఖ

రుస్తుం మైనింగ్ కేసులో ఇద్దరికి బెయిల్

నెల్లూరు (లీగల్): రుస్తుం మైనింగ్ కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏనుగు శ్రీధర్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. రుస్తుం మైన్.. ఎస్సీ ఎస్టీ కేసుల్లో నెల్లూరు రూరల్ డీఎస్పీ విచారణాధికారిగా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో 11, 12వ నిందితులుగా ఆరోపణలను వీరు ఎదుర్కొంటున్నారు. వీరిని జూలై 21న పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ఆదేశాల మేరకు అప్పటి నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాదులు రూపేష్‌కుమార్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి.. పోలీసులు పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. ఒక్కొక్కరూ రూ.25 వేల చొప్పున స్వయం పూచికత్తు.. రూ.25 వేల ఆస్తి విలువగలిగిన ఇద్దరు జామీన్‌దారులు పూచికత్తు సమర్పించాలని.. పోలీసుల విచారణకు సహకరించాలని.. ఏపీ, తెలంగాణలోనే ఉండాలని.. ఇతర ప్రదేశాలకు వెళ్లాలనుకుంటే అనుమతి పొందాలని.. ప్రతి ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు విచారణాధికారి వద్ద హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జొన్నవాడలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో గల కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్నామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

అధికారుల తప్పిదాలకు
సర్పంచ్‌లా బాధ్యులు..?



డీపీఓతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- అన్యాయాలపై న్యాయపోరాటం సాగిస్తాం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి తమ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లపై కక్షసాధింపు చర్యలు, ఒత్తిళ్లు అధికమయ్యాయని, వీటికి అధికారులు సైతం వంతపాడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నగరంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో గల జిల్లా పంచాయతీ అధికారి ఆఫీస్‌లో డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఎల్పీఓలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. అవినీతి, అక్రమాలంటూ సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసుల జారీ తదితర అంశాలపై చర్చించారు. ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు.

వారి తప్పిదాలను రుద్దడం తగదు

సర్పంచ్ భర్త కాంట్రాక్ట్ పనులు చేయకూడదనే జీఓ ఎక్కడైనా ఉందానని కాకాణి ప్రశ్నించారు. వెంకటాచలంలో బీసీ మహిళ.. పొదలకూరులో ఎస్టీ మహిళ సర్పంచ్‌లుగా ఉన్నారని, వీరితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురి మనోభావాలు దెబ్బతీసేలా కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు.

పాలన సాగిస్తోంది పచ్చ పత్రికలా..?

జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అధికారులు పాలన సాగిస్తున్నారా.. లేక పచ్చ పత్రికలానని కాకాణి ప్రశ్నించారు. అందులో వచ్చిన కథనాలపై షోకాజ్ నోటీసులు, స్పందన, నివేదికలు అంటూ.. ఇతర పత్రికల్లో వచ్చిన కథనాలను పట్టించుకోరానని నిలదీశారు. డీఎల్పీఓ విచారణ జరిపి నివేదికలను అందజేస్తే, అవి సక్రమంగా లేవంటూ మరో డీఎల్పీఓతో ఎంక్వైరీ చేయించి సర్పంచ్‌లను బాధ్యులను చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శుల తప్పిదాలను సర్పంచ్‌లపై రుద్ది నిధులను దుర్వినియోగం చేశారు.. అక్రమాలకు పాల్పడ్డారని పత్రికల్లో ప్రకటనలిస్తుండటంతో వారి మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు.

వ్యతిరేకిస్తే కక్షసాధింపా..?

గత ప్రభుత్వ హయాంలో 95 శాతం మంది సర్పంచ్‌లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా గెలుపొందారని, ఆ సమయంలో తాము హుందాగా వ్యవహరించామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ తరహాలో కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని వివరించారు. పసుపు కండువా కప్పుకొంటే మంచివారంటూ.. వ్యతిరేకిస్తే నిధుల దుర్వినియోగం పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికారమెప్పుడూ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అధికారులకు హితవు పలికారు. కూటమి నేతలకు అధికారులు ఊడిగం చేస్తున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక వీరిపై విచారణ ఉంటుందని స్పష్టం చేశారు. పంచాయతీల్లో పనులు చేస్తే బిల్లులివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు పంచాయతీల్లో రూ.లక్షల్లో దుర్వినియోగం జరుగుతోందని, వీటిపై విచారణ జరిపే ధైర్యం ఉందానని ప్రశ్నించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలు

జిల్లాలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, పంచాయతీల్లో జరుగుతున్న కార్యక్రమాలకు సర్పంచ్‌లను ఆహ్వానించడంలేదని, ఒకవేళ అలా జరిగినా వేదికపైకి పిలవడంలేదని విమర్శించారు. కూటమి నేతలు చెప్పినట్లే వారు వింటామంటే సర్పంచ్‌లతో గౌరవప్రదంగా రాజీనామా చేయిస్తామన్నారు. సర్పంచ్‌లకు జరుగుతున్న అన్యాయాలపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నిరసనలు, పోరాటాలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

ఇదేం పద్ధతి..?

వెంకటాచలం పంచాయతీకి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో పాటు వీఐపీలు వస్తుంటారని, వారి పర్యటనల సందర్భంగా పారిశుధ్య, ఇతర కార్యక్రమాలను వందలాది మందితో చేయించాలని అధికారుల నుంచి ఒత్తిళ్లు ఉంటాయని తెలిపారు. దీనికి భారీ స్థాయిలో ఖర్చవుతుందని, అయితే వీటిని పరిశీలించకుండా.. బిల్లులు అందుబాటులో ఉన్నా వాటిని పరిగణనలోకి తీసుకోకుండా రూ.లక్షలను దుర్వినియోగం చేశారంటూ సర్పంచ్‌పై నిందలు మోపడం తగదని హితవు పలికారు.

మొదట్లో హడావుడి.. ఆపై మౌనం

- కేసులు సరే.. చర్యలేవీ..?
- 'పెరమన' ఘటనపై ఇదీ పోలీసుల తీరు

సంగం: పెరమన వద్ద ఇసుక మాఫియా ధనదాహంతో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడిన ఘటనలో మొదట్లో హడావుడి చేసిన పోలీసులు ఆపై మౌనం వహించారు. రాజకీయ ఒత్తిళ్లకు తల్గొగి ఇలా వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. కేసు మాఫీకి అధికార టీడీపీ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తొలుత మృతుడి సోదరుడి కుమారుడు సాయిచైతన్య ఫిర్యాదును స్వీకరించారు. అదే సమయంలో రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోవడంతో ఎఫ్ఐఆర్‌ను తప్పులతడకగా నమోదు చేశారు. డ్రైవర్ లొంగిపోయాడని తొలుత ఎస్పీ చెప్పగా, ఆపై పరారీలో ఉన్నాడని పోలీసులు ప్రకటించడం గమనార్హం.

చర్యలు శూన్యం

టిప్పర్ డ్రైవర్, యజమానితో పాటు ఇసుక అక్రమ రవాణాదారుడు బుజ్జయ్యనాయుడిపై కేసును సంగం పోలీసులు నమోదు చేశారు. అయితే పెరుమాళ్లపాడు నుంచి ఇసుక అక్రమ తరలింపుపై ఎలాంటి దర్యాప్తు చేయలేదు. రాజకీయ నేతలు అడ్డుకోవడంతో వారు మౌనం వహిస్తున్నారు. మరోవైపు పెరుమాళ్లపాడు నుంచి ఇసుక అక్రమ రవాణా వాహనాలు తిరుగుతూనే ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలా అయితే మరెంత మంది చనిపోతారోనంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేడుకగా గంధ మహోత్సవం



చందన్‌మహల్ నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకెళ్తూ..



భారీగా హాజరైన భక్తులు

వెంకటాచలం: దక్షిణాది రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా 248వ గంధ మహోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. దర్గాకు కిలోమీటర్ దూరంలోని చందన్‌మహల్ నుంచి గంధాన్ని గుర్రంపై గురువారం అర్ధరాత్రి ఊరేగించారు. దర్గా వద్దకు శుక్రవారం ఉదయం ఆరింటికి తీసుకొచ్చారు. కసుమూరు వీధుల్లో మేళతాళాల మధ్య వైభవంగా సాగింది. అనంతరం మస్తాన్‌వలీ సమాధిపై చద్దర్‌ను కప్పి ప్రత్యేక ప్రార్థనలను కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ నిర్వహించారు. ఆపై గంధం బిందెను దర్గా ముజావర్లకు అందజేశారు. భక్తులకు పంపిణీ చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యారు.

వసతులు కల్పించకపోవడంపై ఆగ్రహం

గంధ మహోత్సవాల నిర్వహణలో భాగంగా భక్తులకు వసతుల కల్పనలో వక్ఫ్‌బోర్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. రూ.16 లక్షలను వెచ్చిస్తామని చెప్పినా, 40 శాతం కూడా ఖర్చు చేయలేదంటూ గ్రామస్తులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చందన్‌మహల్, మస్తాన్‌వలీ దర్గా ప్రాంగణాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించడంతో అధికారులను నిలదీశారు. ఉత్సవాలకు ఎంత ఖర్చు చేశారో లెక్కలు చెప్పాలని ప్రశ్నించడంతో, వారు వెళ్లిపోయారు. మరోవైపు దర్గాలో మస్తాన్‌వలీ సమాధిని పూలతో ఏటా అలంకరిస్తారు. అయితే ఈసారి అంతంతమాత్రంగా ఉంటడంతో గొడవకు దిగారు. ఏర్పాట్లు, వసతులు దర్గా ఈఓ పర్యవేక్షణలోనే జరిగాయని, తమకెలాంటి సంబంధంలేదని వక్ఫ్‌బోర్డు సిబ్బంది నచ్చజెప్పేందుకు యత్నించారు. గ్రామస్తులు మండిపడుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఈఓ.. చందన్‌మహల్ వద్దకు రాకుండానే ఆగిపోయారు.

తహలీల్, ఫాతేహా నేడు

గంధ మహోత్సవాల్లో భాగంగా తహలీల్ ఫాతేహాను శనివారం ఉదయం నిర్వహించనున్నామని ముజావర్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో..

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో 252వ గంధ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గంధాన్ని ఫయాజ్ ఆధ్వర్యంలో దంచారు. అనంతరం కొబ్బరి దివిటీలు, విద్యుద్దీపకాంతుల నడుమ బాణాసంచా పేలుస్తూ హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు చేరుకున్నారు. అక్కడ అమ్మాజాన్, అబ్బాజాన్ సమాధులకు గంధాన్ని లేపనం చేశారు. ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. ఎలాంటి తొక్కిసలాట జరగకుండా గంధాన్ని పంపిణీ చేశారు.



సమాధులకు గంధం లేపనం

అదే పంథా... ఆగని దందా

వెంకటాచలం: కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాల్లో ఏటా భక్తులు నిలువుదోపిడీకి గురవుతూనే ఉన్నారు. భక్తిభావంతో వచ్చిన వారు హుండీల్లో నగదును వేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నా, అధికారులు అడ్డుకట్ట వేయకపోడం వివాదాస్పదమవుతోంది. శుక్రవారం సైతం ఇదే తీరును అవలంబించడంతో భక్తులు గొడవకు దిగారు. గంధ మహోత్సవం పూర్తయిన వెంటనే మస్తాన్‌వలీని దర్శించుకునేందుకు వేలాది మంది పోటీపడ్డారు. వాస్తవానికి సాధారణ రోజుల్లో దర్గాలో రెండు హుండీలే ఉంటాయి. అయితే మహోత్సవాల సందర్భంగా మరో ఎనిమిది హుండీలను కాంట్రాక్టర్లు ఏర్పాటు చేసి, ప్రతి దగ్గర సిబ్బందిని పెట్టారు. దర్గాలోకి ప్రవేశించే ప్రతి ఒక్కర్నీ వదలకుండా అందులో నగదును వేయాలని డిమాండ్ చేశారు. దీంతో భక్తులకు.. హుండీ కాంట్రాక్ట్ సిబ్బందికి మధ్య గొడవ జరిగింది.

విచ్చలవిడిగా డైమండ్ డబ్బా నిర్వహణ

కసుమూరులో డైమండ్ డబ్బాను విచ్చలవిడిగా నిర్వహించారు. దర్గాకు కూతవేటు దూరంలో రోడ్డు పక్కన దీన్ని కొందరు నిర్వాహకులు గురువారం రాత్రి ఆరు నుంచి వేశారు. శుక్రవారం తెల్లవారుజాము వరకు వ్యవహారం సాగింది. నిర్వాహకులు భారీగా సొమ్ము చేసుకున్నారు.



దర్గాలో అదనంగా ఏర్పాటు చేసిన హుండీలు

జోరుగా మద్యం అమ్మకాలు

గ్రామ నలువైపులా మద్యం విక్రయాలు బహిరంగంగా సాగాయి. వైన్ షాపు నిర్వాహకులు కార్లు, ఆటోల్లో మద్యం బాటిళ్లను తీసుకొచ్చి కొందరితో విక్రయాలు సాగించారు. ఎమ్మార్పీ కంటే రూ.70 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ శుక్రవారం అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూ శిలాతోరణం వరకు చేరుకుంది. స్వామివారిని 68,095 మంది గురువారం అర్ధరాత్రి వరకు దర్శించుకోగా.. తలనీలాలను 23,932 మంది భక్తులు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.7 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని వారికి 20 గంటల్లో లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో దర్శనమవుతోంది. కాగా సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.



నిజాలు చెబితే కేసులు బనాయిస్తారా?

ప్రభుత్వ వైఫల్యాలను వెలికితీసి ప్రజలకు తెలియజేస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం కూటమి ప్రభుత్వానికి తగదు. ఎప్పుడూ ఒకే పార్టీ అధికారంలో ఉండదనే విషయాన్ని గుర్తించుకోవాలి. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పాలన సాగిస్తే బాగుంటుంది.

– ఎస్‌కే మస్తాన్‌బీ, ఐద్వా జిల్లా కార్యదర్శి



కక్ష సాధింపు మానాలి



పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరించే విధంగా సాక్షి ఎడిటర్, ప్రతినిధులపై కేసులు పెడుతోంది. ప్రభుత్వ తప్పిదాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్న పత్రికలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారింది.

– దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



నెల్లూరు(లీగల్): జిల్లా జడ్జి జి.శ్రీనివాస్‌ను శుక్రవారం కోర్టులోని ఛాంబర్‌లో ఎస్పీ అజిత వేజెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. పాలనాపరమైన విషయాలను చర్చించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు రూరల్: వాహనమిత్ర పథకానికి సంబంధించి దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్డు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తదితరాలతో దరఖాస్తులు అందించాలని తెలియజేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన తల్లీబిడ్డ

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



దుర్గమ్మ, ముత్యాలమ్మ

కావలి(అల్లూరు): కావలిలోని వైకుంఠపురం మసీదు ఎదురు వీధిలో ఉన్న పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిన తల్లీబిడ్డను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద ఎస్టీ కాలనీలో వేటగిరి దుర్గమ్మ, ఆమె కుమార్తె ముత్యాలమ్మ నివాసం ఉంటున్నారు. శుక్రవారం తల్లి కుమార్తెతో కలిసి చెత్త ఏరుకునేందుకు పాడుబడిన బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 40 అడుగుల లోతున్న బావిలో ఇద్దరూ పడిపోయారు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రోప్ సాయంతో బావిలోకి దిగి వారిని రక్షించారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు లాడ్జీలు, వాహన తనిఖీలు నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగడం, డ్రంక్ అండ్ డ్రైవ్, నిబంధనల ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించి కేసులు నమోదు చేశారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనల్ని ఉల్లంఘించిన 87 మందికి రూ.33,135 జరిమానా విధించి రెండు వాహనాలను సీజ్ చేశారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న పది మందిపై కేసులు పెట్టారు. జిల్లాలోని 31 లాడ్జీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతి గదిని పరిశీలించి అక్కడున్న వారిని ఎక్కడి నుంచి ఏ పనిమీద వచ్చారు?, ఏం చేస్తుంటారు తదితర వివరాలను ఆరాతీశారు. రిసెప్షన్ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. లాడ్జీలో గదిని అద్దెకు తీసుకునేవారి వివరాలను రోజూ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులను గుర్తిస్తే వెంటనే డయల్ 112, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



లాడ్జీలో రిసెప్షన్‌లో రికార్డును పరిశీలిస్తున్న చిన్నబజారు పోలీసులు



వాహనదారుడి వివరాలు తెలుసుకుంటున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు

మా శ్రమను దోచుకుంటున్నారు

- విద్యుత్ కార్మికుల ఆవేదన
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. నెల్లూరులోని విద్యుత్ భవన్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఎస్ఈ విజయన్ కార్మికులకు పూలమాలలు వేసిన దీక్షలను ప్రారంభించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం చెబుతున్నాయన్నారు. అందుకు కారణమైన ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఏలు సకాలం లో చెల్లించడం లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని తెలిపారు. 25 సంవత్సరాలు సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, మీటర్ రీడర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దామోదర్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, హజరత్ వలీ, కృష్ణ, రమణారెడ్డి, నాంచారయ్య, సంతోష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన పేర్నాటి



నెల్లూరు(పొగతోట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లాకు 2,838 ఇళ్ల కేటాయింపు

నెల్లూరు(అర్బన్): ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద నెల్లూరు జిల్లాకు 2024 – 25 సంవత్సరానికి 2,430, 2025 – 26కు 408 కలిపి మొత్తం 2,838 ఇళ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఇందుకు సంబంధించి జీఓ ఆర్టీ నంబర్ 65 రెండు రోజుల క్రితం విడుదలైంది. ఒక్కో యూనిట్ నిర్మాణానికి రూ.2.50 లక్షలు కేటాయించింది. అందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష భరించనున్నాయి. లబ్ధిదారుడే స్వయంగా ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. అదనంగా అయ్యేను వారే పెట్టుకోవాలి. ఇంటి నిర్మాణ విస్తీర్ణం కనిష్టంగా 30 చదరపు మీటర్లు, గరిష్టంగా 45 చదరపు మీటర్లుగా ఉండాలని జీఓలో పేర్కొన్నారు. వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోవాల్సిన వివరాలు, విధి, విధానాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు.

కలువ సోయగం





ప్రకృతి అందాలు పరవశింపజేస్తాయి. ముత్తుకూరు మండలంలోని చెరువును కమ్మేసిన తెల్ల తామర పుష్పాలు నీలాకాశం సాక్షిగా ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నాయి. అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజల్ని ఈ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ..

- నెల్లూరులో ఏఐఎస్ఎఫ్ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అమ్మకానికి పెట్టిందని ఆరోపించారు. పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6,400 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ కళాశాలలు ఇబ్బందులు పెడుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివమ్‌వర్మ, సాయి, కోటి, సుధీర్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వానలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో శుక్రవారం ఆత్మకూరు, సంగంలో తేలికపాటి జల్లులు కురిశాయి. పొదలకూరు, వెంకటాచలం, ముత్తుకూరు, మనుబోలు, కలిగిరి, బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి, కోవూరు, కొడవలూరు, విడవలూరు తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. నెల్లూరు నగరంలో సాయంత్రం 5 గంటల నుంచి సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ కాసింది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమైంది. ఖాళీ ప్లాట్లతోపాటు లోతట్టు ప్రాంతాలైన మనుమసిద్ధినగర్, మన్సూర్‌నగర్, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, జనార్దనరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.

12 సవర్ల బంగారం, రూ.50 వేల చోరీ

కావలి(అల్లూరు): బంగారం, నగదును దోచుకెళ్లిన ఘటన కావలి పట్టణ పరిధిలోని కచ్చేరిమిట్ట కాలనీలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుంచాల యువరాజు, అతని భార్య అమల కచ్చేరిమిట్టలో నివాసం ఉంటున్నారు. భర్త దుస్తుల షాపులో, భార్య ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. అమలకు నైట్ షిఫ్ట్ ఉండటంతో ఆస్పత్రికి వెళ్లింది. యువరాజు తల్లి ఆ కాలనీలోనే ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో అతను అక్కడికెళ్లాడు. ఈ క్రమంలో యువరాజు ఇంట్లో దొంగలు పడి 12 సవర్ల బంగారం, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. శుక్రవారం సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు ఆరాతీశారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది.

వృద్ధురాలి బాగోగులు పట్టించుకోలేదని..

- కొడుకు, కోడలిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలి బాగోగులు పట్టించుకోని కొడుకు, కోడలిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం శ్రామికనగర్‌లో జయకుమారి తన కొడుకు, కోడలితో నివాసముంటోంది. ఆమె భర్త గతేడాది జూన్‌లో అనారోగ్యంతో మృతిచెందాడు. కోడలు కొంతకాలంగా అత్తకు సరిగ్గా అన్నం పెట్టకుండా తిడుతోంది. కోడలి వైఖరిని జయకుమారి కుమారుడి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఈనెల 14వ తేదీన వృద్ధురాలు తన ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని వారిద్దరికి చెప్పింది. కోపోద్రిక్తులైన వారు ఆమెను నానా దుర్భాషలాడారు. బాధితురాలు శుక్రవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బర్త్‌డే పార్టీకి వెళ్లి..

- రైలు కింద పడిన స్నేహితులు
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): వారిద్దరూ స్నేహితులు. ఒకేచోట పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులో?, మరే ఇతర కారణమో తెలియదు గానీ రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనా స్థలంలో ఒకరు చనిపోగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన జి.ఉమేష్‌చంద్ర (24), పొదలకూరు మండలం తోడేరు పంచాయతీకి చెందిన పి.వంశీ నెల్లూరు నగరంలోని హరనాథపురంలో ఉన్న ఓ హోటల్లో పనిచేస్తున్నారు. అక్కడే నివాసముంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి ఇద్దరూ బర్త్‌డే పార్టీ కోసం హోటల్ యజమాని నుంచి రూ.2 వేలు తీసుకుని బయటకొచ్చారు. ఏం జరిగిందో తెలియదు గానీ 18వ తేదీ తెల్లవారుజామున వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉమేష్‌చంద్ర అక్కడికక్కడే చనిపోగా మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న వంశీని అక్కడికే తరలించి ఇరు కుటుంబాలకు సమాచారం అందించారు. వంశీ కుటుంబ సభ్యులు నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ఎస్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు(బారకాసు): ఇచ్చిన హామీ ప్రకారం సమ్మె కాలం జీతాలు తక్షణమే ఇవ్వాలని, ఇతర సమస్యల్ని పరిష్కరించాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య మాట్లాడుతూ జీతాలివ్వకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇటీవల 60 సంవత్సరాల వయసు నిండిన జోసఫ్ అనే కార్మికుడిని తొలగించడంతో మానసిక్షోభకు గురై ప్రాణాలు కోల్పోయాడన్నారు. కూటమి ప్రభుత్వం పరోక్షంగా కార్మికుల ప్రాణాలు బలిగొంటోందన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జీఓ ఉన్నా పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కరించకపోతే విధులు బహిష్కరించి ఆందోళన చేపడతామని తెలిపారు. అనంతరం కమిషనర్ నందన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు సీహెచ్ మనోజ్‌కుమార్, ఎం.అశోక్, జి.కామాక్షమ్మ, మట్టిపాటి శ్రీనివాసులు, దేశమూర్తి, సుజాతమ్మ, రాంబాబు, మాలకొండయ్య, రాజేంద్ర, బాలమురగన్, షబ్బీర్, సురేంద్ర, పందల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.25
పండ్లు	రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	రూ.138
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్	రూ.246
స్కిన్‌లెస్ చికెన్	రూ.272
లేయర్ చికెన్	రూ.187